

ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా రాముడు

- యువజన, క్రీడా శాఖలూ ఆయనకే..
- నేడు జిల్లాకు రాక..
- ఘనస్వాగతానికి కార్యకర్తల సన్నాహాలు
- పట్టణంలో భారీ ర్యాలీ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు యువజన, క్రీడాశాఖలను కేటాయించారు. రాయచోటి ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలిచిన రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి పదవి వరించిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శుక్రవారం శాఖలను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే ముఖ్యమైన శాఖలలో నాల్గవశాఖ అయిన రవాణాశాఖను రాముడికి కేటాయిం చారు. అదే విధంగా యువజన, కీడ్రాశాఖలు కూడా అతి ముఖ్యమైనవే. దీనిపైన రాముడి వర్గం సంబరాలు జరుపుకుంటోంది. మా నాయకుడిపై నమ్మకంతోనే.. ఇంత ముఖ్యమైన శాఖలు అప్పగించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కడప, అన్నమయ్య, చిత్తూరు పార్ల మెంటు పరిధిలో రాంప్రసాద్‌రెడ్డి ఒక్కడికే మంత్రి పదవి వచ్చిన విషయం తెలిసిందే. 62 సంవత్సరాల రాయచోటి నియోజకవర్గ చరిత్రలో మొదటిసారిగా మంత్రి పదవి రాముడిని వరించింది.

నేడు జిల్లాకు రాక

మంత్రి పదవి స్వీకరించిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు వస్తున్నట్లు ఆయన వర్గీయులు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి.. విజయవాడకు వెళ్ళి మంత్రి పదవితో వస్తుండడంతో ఆయన వర్గీయులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటూ.. భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచి భారీ సంఖ్యలో వాహనాలలో వెళ్లనున్నారు. రాయచోటి పట్టణంలో భారీ ర్యాలీ చేయనున్నారు. ఈ ర్యాలీకి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రానున్నారు.

రాయచోటిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి నియోజవర్గ ప్రజల ద్వారానే.. నాకు మంత్రి పదవి వచ్చింది. రాయచోటి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడం నా బాధ్యత. మంత్రివర్గంలోని అన్ని శాఖల మంత్రులతోనూ.. సత్సంబంధాలు పెట్టుకుని.. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొస్తా. రాయచోటి నియోజకవర్గానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాను.. అదే విధంగా రోడ్డు ప్రమాదాలు లేని రాష్ట్రంగా రాష్ట్రాన్ని చేయడమే లక్ష్యంగా పని చేస్తాను. భద్రతా చట్టాన్ని సక్రమంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటా. కాలం చెల్లిన వాహనాల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ స్టేడియాలు నిర్మించేందుకు కృషి చేస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించేందుకు కృషి చేస్తాం.. నాపై నమ్మకం ఉంచి.. నాకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో పాటు.. మంత్రిపదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారాలోకేష్‌కు ధన్యవాదాలు తెలుపు తున్నానన్నారు.



ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

- రాయచోటి కోర్టు ఆవరణలో చంద్రబాబుకు ధన్యవాదాలు

రాయచోటిటౌన్, జూన్ 14: ప్రజల ఆస్తులకు భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాయచోటి బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాయచోటి కోర్టు ఆవర ణలో సీఎం చంద్రబాబు ప్లెక్సీని ఏర్పాటు చేసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా, నిర్లక్ష్య వైఖరితో, న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను తగ్గించేలా, ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసేందుకు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చిందన్నారు. ప్రజలు, రైతులు వారి అవసరాలకు ఆస్తులను అమ్ముకోవాలంటే టైటిలింగ్ యాక్టు ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలన్నారు. భూ సమస్య వచ్చినప్పుడు కోర్టుకు వెళ్లి న్యాయం పొందడానికి వీలులేకుండా చేశారన్నారు. ఇంతటి ప్రమాదకరమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు పరచాలని టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, అన్ని వర్గాల వారు ఉద్యమించారన్నారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను తేలిగ్గా తీసుకొని ఆపహాస్యం చేసిందన్నారు. దీంతో అప్పటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పారన్నారు. ఈ మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజా వ్యతిరేకమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు పరుస్తూ సంతకం చేసి ప్రజల ఆస్తులకు రక్షణ తీసుకొచ్చారన్నారు. కాగా, వృద్ధుల, దివ్యాంగుల పెన్షన్, పిల్లల చదువుల కోసం ఇస్తున్న సొమ్ము లాంటివి తప్ప మిగిలిన అన్ని రకాల ఉచిత పథకాల సొమ్మును ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినప్పటికీ.. అదే సొమ్మును రెండేళ్ల పాటు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసి శాశ్వత ఆదాయాన్నిచ్చే అమరాతి అభివృద్ధికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తోడ్పడాలని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ టీ.ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఉపాధి కోసం హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై పట్టణాలకు తరలిపోతున్న యువతకు అమరావతిలోనే ఉపాధి దొరికే విధంగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని. కార్యక్రమలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి నాగముని, రాజ్‌కుమార్‌రాజు, ఆనంద్‌కుమార్, ధనుం జయ్‌కుమార్, చిన్నయ్య, ఉదయగిరి రామాంజనేయులు, హుమయున్‌బాషా, వరలక్ష్మి, సుబ్బరాయుడు, వీరనాగయ్య, నాగరాజ తదితరులు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.



రాయచోటి కోర్టు ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న రాయచోటి న్యాయవాదులు



గుర్రంకొండలో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూడాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి

గుర్రంకొండ, జూన్ 14 : పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గుర్రంకొండ హైస్కూల్‌లో ఉన్న స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందజేయా లన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల విజయవంతంలో అధికారుల కృషి మరువలేనిది

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి (కలెక్టరేట్) జూన్ 14 : సార్వత్రిక ఎన్నికలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని.. అందుకు అధికారులు చేసిన కృషి మరవలేనిదని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న పలువురు అధికారులను అభినందించి ప్రశంసాపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కౌంటింగ్ ముగిసేవరకు అధికారులందరూ కష్టపడి పనిచేయడంతోనే విజ యవంతంగా ఎన్నికలు నిర్వహించామన్నారు. నూతన జిల్లాలో ఎన్నికలు మొదటి సారి అయినప్పటికీ రాంత్రింబవళ్లు కష్టపడి పనిచేసినందుకు సిబ్బందికి అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణరావు మాట్లాడుతూ జిల్లా యం త్రాంగం కష్టపడి పని చేయడంతోనే ఎన్నికలు సజావుగా నిర్వహించామని తెలిపారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మాద్‌ఖాన్

రాయచోటిటౌన్, జూన్14: బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మాద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మత సారమస్యానికి ప్రతీక అని, జూన్ 17న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్య మాలలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీ సు, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. రాయచోటి పట్టణంలో ఉన్న జంతు వధశాలలలో నీటి సమస్య రాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. జంతువధశాలలో వచ్చే వేస్ట్‌ను దూరంగా వేయాలని.. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, ముస్లిం మతపెద్దలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రషర్ మిషన్‌పై మైనింగ్ అధికారుల దాడి

● అక్రమంగా నడుపుతున్నారు : మైనింగ్ అధికారులు
● క్రషర్ మిషన్ ప్రాంతంలోని గదుల సీజ్



క్రషర్‌మిషన్ ప్రాంతంలో గనులశాఖ అధికారులు - గదులకు సీజ్ చేసిన దృశ్యం

ముద్దనూరు జూన్14: మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ మునిరాజారెడ్డికి చెందిన రాయి తవ్వకం పొలం సహా క్రషర్ మిషన్‌ను శుక్రవారం జిల్లా గనులశాఖాధికారులు సీజ్ చేశారు. జిల్లా గనులశాఖాధికారి ఏడీ రవిప్రసాద్ సమాచారం మేరకు వివరాల్లోకెళితే.. మునిరాజారెడ్డి అక్రమంగా ఓబులాపురం, దేనేపల్లి ప్రాంత పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా రాయి తవ్వుతున్నారన్నారు. అలాగే శ్రీశ్రీనివాస మెటల్ సప్లయర్స్ క్రషర్‌ను కూడా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి పరిశీలించామన్నారు. పొలాల్లో రాయి కోసం తవ్విన గుంతలను కొలతలు వేశామన్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని స్టోన్ క్రషర్ వద్ద నిల్వ చేసిన కంకరను కొలతలు వేశామన్నారు. దీనికి క్రషర్ మిషన్ ప్రాంతం గదులను వీఆర్వోతో పంచనామా చేయించి సీజ్ చేశామన్నారు. ఏపీ గనులు, ఖనిజాల చట్టం 1966, 2017 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సువర్ణాదేవి రెవెన్యూ సిబ్బంది, జిల్లా గనులశాఖ కార్యాలయం అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి అడవిలో శవమై...

అనుమానిస్తున్న కుటుంబ సభ్యులు



చెట్టుకు వేలాడుతున్న సుదర్శన్ మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

లక్కిరెడ్డిపల్లె జూన్ 14: సుమారు 18 రోజులుగా కనిపించని చిన్నకొండు సుదర్శన్ (40) శవమై అడవిలో చెట్టుకు వేలాడుతుండడాన్ని గొర్రెల కాపరులు గుర్తించారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే.... పాశెం పంచాయితీ బుర్దుపల్లె వాసి చిన్నకొండు సుదర్శన్ 18 రోజుల కిందట బుర్దుపల్లె సమీప శేషాచలం అడవుల్లోకి వేటకు వెళ్లాడు. కుటుంబీకులు రాత్రి వరకు ఎదురు చూశారు. మరుసటి రోజున కూడా వేచి చూసి చివరికి జూన్1వ తేదీన లక్కిరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అనంతరం కన్పించక పోవడంతో ఎవరో చంపిఉంటారని కుటుంబీకులు అనుమానించారు. దీంతో వేటకు జతగావెళ్లిన వారిని పోలీసులు విచారించినా ఆచూకీ లభించక పోవడంతో అనుమానం మరింత ఎక్కువైంది. శుక్రవారం మనమోతలగుట్ట సమీపంలో చెట్టుకు వేలాడుతున్న సుదర్శన్ మృతదేహాన్ని గొర్రెలకాపరులు గుర్తించి బంధువులకు తెలిపారు. వెంటనే పోలీసులు, బంధువులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఎవరో చంపి అడవిలోకి తీసుకెళ్లి చెట్టుకు ఉరివేశారని మృతుని భార్య శివమ్మ, కుమారుడు వంశీ ఆరోపిస్తున్నారు. మృతుని కాళ్ల కాలినట్లు ఉండడాన్ని గుర్తించిన కుటుంబీకులు పలు విధాలుగా ఆరోపిస్తున్నారు. అయితే ఎవరో ఎక్కడో చంపి ఇక్కడికి తెచ్చి ఉరివేశారా... లేక ఆయనే ఉరివేసుకున్నాడా తేలాల్సి ఉందని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఏదేమైనా పోస్టుమార్టంలో తేలుతుందని పోలీసులు తెలిపారు.

మా అన్నను హత్య చేశారు : కుటుంబీకులు

చిన్నకొండు సుదర్శన్‌ను కొందరు గ్రామస్తులే హత్యచేసి కొండల్లో ఉరేశారని మృతుని తమ్ముడు వీరనారాయణ, భార్య శివమ్మ అనుమానించారు. వారు విలేకర్లతో మాట్లాడుతూ పాశెంగొల్లపల్లె, చిన్నపోతులపల్లె వాసులు రెడ్డెన్న, భాస్కర్, ఓబులేసు, ఈశ్వరయ్య, చాన్‌తో కలసి మేనెల 28న అడవికి వెల్లారు. 18 రోజులైనా ఆచూకీ తెలియడం లేదని వెంటవెల్లిన వారే చంపి ఉంటారని వారు వివరించారు. ఈ విషయమై పోలీసులు పట్టించుకోవడంలేదని, అనుమానితుల పేర్లు పోలీసులకు చెప్పినా విచారించడం లేదన్నారు. ఈవిషయం పూర్తిగా తేలే వరకూ శవాన్ని పూడ్చనీయమన్నారు. పోలీసులు మాకు న్యాయం చేయలేదని, న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు చేయమన్నారు. ఈ విషయంపై ఎస్ఐ విష్ణువర్ధన్ వివరణ కోరగా పోస్టుమార్టంలో హత్యగా తేలితే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

కూటి కోసం వచ్చి....

లారీ డ్రైవర్ మృతి ● సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



శ్రీనివాసులు మృతదేహం

సుండుపల్లె, జూన్14: కూటి కోసం ఊరు కాని ఊరికి వచ్చిన నంద్యాల జిల్లా ఔకు మండల వాసి కే. శ్రీనివాసులు (35) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్రీనివాసులు లారీలో సిమెంటు బస్తాలు వేసుకుని సుండుపల్లెకు వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున రాయవరం ప్రధాన రహదారి ఈదులవంక బ్రిడ్జి సమీపంలో సిమెంటు లారీ పైన పట్ట తీస్తుండగా పైనుంచి పడి మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ తీగలు తగిలి పడ్డాడా లేక పట్టు తప్పి కింద పడ్డాడా అని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయం పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు, భార్య, తల్లిదండ్రులున్నారు. మృతుడి తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.


రక్తదానంతో పునర్జన్మ

ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప (మారుతీనగర్) జూన్ 14: తల్లి జన్మ మాత్రమే ఇస్తుందని, ఏదేని ప్రమాదంలో గాయపడిన బాధితులకు రక్తదానంతో పునర్జన్మ ప్రాప్తిస్తుందని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జైభారత్ వీర శివాజీ ది ఫ్రిజర్వేటర్ సేవా సమితి (జేబీవీఎస్), సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో ప్రత్యేక రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఎందరో తలసేమియా బాధితులు, గర్భిణులు రక్తం కొరతతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి నడుం బిగించాలన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ మాతృమూర్తి జన్మనిస్తే రక్తదాతలు పునర్జన్మ నిస్తున్నారని, కావున అలాంటి పుణ్యకార్యంలో యువత భాగస్వామ్యమై కనీసం ఏడాదికి మూడు సార్లయినా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య అధికారి రవిబాబు, ఎయిడ్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ భాస్కర్, రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర, సమితి జాయింట్ సెక్రటరీ విజయ్, సభ్యులు సురేంద్ర, వరప్రసాద్, శ్రీకాంత్‌తో పాటుగా పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 14: ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు సహకరించాలని విశ్రాంత పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టరు వీరభద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో కళాశాల ప్లాటినం జూబ్లీ సన్నాహక సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గతంలో ఈ కళాశాల ఎంతగానో చైతన్యపరచి వారి వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దిందన్నారు. విద్యార్థులు స్వయంకృషితో ఎదగాలని కోరారు. అనంతరం కళాశాలలో చదివి అధ్యాపకులుగా పనిచేసిన ఎంసీ వెంకటసుబ్బయ్య, రఘునాథరెడ్డి, వై.చెన్నారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఎస్ఎం బాషా, సరస్వతి, వెంకటసుబ్బయ్య జయప్రకాశ్‌ను సన్మానించారు. సెప్టెంబరు 14, 15, 16 తేదీల్లో జరిగే కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు దేశవ్యాప్తంగా ఉన్న కళాశాల పూర్వవిద్యార్థులంతా హాజరవాలని, పూర్వవిద్యార్థుల కమిటీ కోరింది. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, పూర్వవిద్యార్థుల కార్యదర్శి కె.శివరాం, ప్రోగ్రాం కో ఆర్డినేటరు రాజశేఖర్‌రెడ్డి, టీపీడీపీ కార్యదర్శి లయన్ చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, జనార్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థుల కమిటీ ప్రతినిధులు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

● ఇష్టారాజ్యంగా సిబ్బంది వ్యవహారం ● చేతివాటం ప్రదర్శిస్తున్న వైనం
● నీటికి పొంతనలేని లెక్కలు ● ఎర్రగుంట్లలో ఒక్కో వీధికి ఒక్కోరకంగా తాగునీటి సరఫరా



కడప రోడ్డులోని సంప్

ఎర్రగుంట్ల, జూన్ 14: ఎర్రగుంట్లలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. పెన్నా, కమలాపురం నదుల స్కీం ద్వారా వస్తున్న నీటికి, సరఫరా అవుతున్న నీటికి అసలు పొంతనలేకుండా ఉంది. కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవరిస్తుండడంతో తాగునీటి సరఫరా ఒక్కోవీధిలో ఒక్కోరకంగా ఉంది. ఒక వీధికి రోజూ నీరు వస్తుంటే మరో వీధికి రెండు, మూడు రోజులకు, మరికొన్ని వీధులకు వారం, పదిరోజులకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. గతంలో నెలకు రెండు సార్లు మాత్రమే తాగునీరు వచ్చిన సంఘటనలూ లేకపోలేదు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించే ప్రయత్నాలు చేసే అధికారులకు కొందరు సిబ్బంది తమ పలుకుబడి, చాకచక్యం ఉపయోగించి చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఓ అధికారి స్వలాభం చూసుకుని ఎర్రగుంట్ల నగర పంచాయతీని భ్రష్టుపట్టించారని, సిబ్బందిపై పూర్తిగా పట్టుకోల్పోయి ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. తాగునీరు రావడం లేదని, కలుషితమౌతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని, కనీసం వీధుల్లోకి తొంగిచూడలేదనే విమర్శలున్నాయి. కొందరు అధికారులకు సిబ్బంది సహకరించడంతో మిగిలిన వారు లెక్కలేని తనం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు సిబ్బందితో రిపేరీ ఖర్చులు లక్షల్లో మింగేశారని కౌన్సిల్ సమావేశాల్లో విమర్శించారు.

● ఎర్రగుంట్లకు పెన్నా నది నుంచి అయ్యప్ప స్వామి గుడి వెనకున్న బోర్ పాయింట్స్ నుంచి, రామాంజనేయపురం ఫిల్టర్ పాయింట్ నుంచి రెండు ప్రధాన పైప్‌లైన్ల గుండా నీటి సరఫరా అవుతోంది. ఈ నీరంతా రాణీవనం సంప్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఎలాంటి అటంకాలు లేకపోతే రోజూ రెండు ఎంఎల్‌డీ నీరు ఇక్కడికి చేరుతుంది. కమలాపురం నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా ఎర్రగుంట్ల కడప రోడ్డులో ఏర్పాటు చేసిన సంప్‌కు కనెక్షన్ ఇచ్చారు. ఎలాంటి ఆటంకాలు లేకపోతే ఇక్కడి నుంచి రోజుకు సుమారు 0.6ఎంఎల్‌డీ నీరు వస్తోంది. అంటే మొత్తానికి తాగునీరు పెన్నా, కమలాపురం నుంచి రోజుకు 2.5 ఎంఎల్‌డీ నీరు ఎర్రగుంట్లకు చేరుతోంది.

రోజుకు 4ఎంఎల్‌డీల నీరు అవసరం

ఎర్రగుంట్ల జనాభా అవసరాలకు రోజుకు 4ఎంఎల్‌డీల నీరు అవసరం. అయితే తాగునీరు ద్వారా 2.5ఎంఎల్‌డీ నీరు వస్తోంది. మిగతా నీరు ఎర్రగుంట్ల నగర పంచాయతీలో ఏర్పాటు చేసిన 46మినీ బోర్ స్కీంల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వీటికి కరెంటు బిల్లులు భారీగా వస్తున్నట్లు సమాచారం. చాలా ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా రాకపోవడం, మరికొన్ని చోట్ల లాంగ్ పైప్ లైన్, ఏరియా ఉండడంతో 24గంటల పంపింగ్ అవసరముందని తెలుస్తోంది. చాలా చోట్ల 24 గంటల బోర్ పంపింగ్ అవసరం లేకపోయినా ఆడిస్తుండడం, సరైన నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తోందన్న విమర్శలున్నాయి. ఇది నగరపంచాయతీకి మోయలేని భారంగా మారుతోంది.

● రాణీవనంలో పదిలక్షల కెపాసిటీ గల ఈఎస్ఎల్ఆర్ నిర్మించారు. సంప్ నుంచి ఈ ట్యాంక్‌ను నింపి రాణీవనం, ప్రకాష్‌నగర్, వినాయక నగర్, సుందరయ్యనగర్‌కు నీరు వదులుతున్నారు. ఓ వీధికి డైరెక్టు కనెక్షన్ ద్వారా కూడా నీరు వదులుతున్నట్లు సమాచారం. వినాయకనగర్ ఆర్ఓబీ వద్ద మరో ట్యాంకు కూడా ఉంది. అయితే ఈ వీధులకు బోర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఎక్కడా ఇప్పటి వరకు బోర్లు వేయకపోవడం గమనార్హం. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. రాణీవనం సంప్ నుంచి రెండు పంపుల ద్వారా కడపరోడ్డులోని సంప్‌కు, నడివూరులోని ట్యాంక్‌కు నీరు పం పింగ్ చేస్తారు. అయితే వీటికి బ్రేక్ పడుతున్నట్లు సమాచారం. కడప రోడ్డు సంప్ వద్ద ట్యాంక్ నుంచి మహేశ్వరనగర్, క్రాంతిగనర్, వేంపల్లిరోడ్డు ప్రాంతాలకు నీరు వదులుతున్నారు. నడివూరు ట్యాంక్ ద్వారా ఆరు వంతులు వదులుతున్నారు.

సగం జనాభా ఇక్కడే....

అయితే పాత నగరపంచాయతీ కార్యాలయం వద్దనున్న ట్యాంక్ నుంచి 9వ వార్డు నుంచి 18వ వార్డు వరకు నీటి వంతులున్నాయి. 1.20లక్షల లీటర్ల కెపాసిటీ ఉన్న ఈ ట్యాంకుకు సుమారు 13వంతులు (సుమారు 20వేల జనాభా కలిగి 60వీధులు). 20వార్డులో సగం వార్డుల వంతులు న్న ఈ ట్యాంకు కు మాత్రం తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. దీంతో రోజుకు ఒకటి, రెండు సార్లు నిండితే గగన మే. ఇలా 13వంతులున్న ఈ ట్యాంకు పరిధి వీధులకు తాగునీరు మాత్రం 6 నుంచి 10రోజులు పడుతోంది. అది కూడా ఎలాంటి అటంకాలు లేకపోతేనే. లేదంటే తాగునీరు ఎప్పుడు వస్తుందో చెప్పలేమని ప్రజలు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా నగర పంచాయతీకి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ఈవిషయమై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మొదటి రోజునుంచే చర్యలకు ఉపక్రమించి అధికారులకు సూచనలు చేశారు. నిధులపై కూడా ఆయన హామీ ఇచ్చి చర్యలు తీసుకోమని చెప్పడం గమనార్హం.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాం

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాము. పెన్నా, కమలాపురం నుంచి వచ్చే నీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాము. ఒక్కోవీధికి ఒక్కోరకంగా నీరు వస్తున్న మాట వాస్తమన్నారు. పాత నగరపంచాయితీ కార్యాలయం వద్ద నున్న ట్యాంకుపై ఎక్కువ వంతులున్నాయి. సంప్‌ల నుంచి నీరు ఇక్కడికి సక్రమంగా రాకపోవడాన్ని గమనించాము, వీటిని సరిదిద్దుతాం. కమలాపురం నుంచి మరింత నీటిని తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాము. ట్యాంకులకు నీటిని ఎక్కించి వీధులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాము. రాణీవనం, ప్రకాష్‌నగర్, వినాయకనగర్‌లకు బోర్లు వేసి రోజూ నీటిని ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాము. సంప్‌ల నుంచి నీటి వినియోగంపై నిశితంగా పరిశీలిస్తున్నాము.

రామక్రిష్ణయ్య, కమిషనర్,
ఎర్రగుంట్ల నగర పంచాయతీ

ఆటో బోల్తా - ఉపాధి కూలీకి గాయాలు



గాయపడిన కూలితో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఏపీఓ

వల్లూరు, జూన్ 14: తోళ్లగంగనపల్లె పంచాయతీలో ఉపాధి కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తాపడడంతో కూలీలకు గాయాలైనట్లు ఎంపీడీఓ, ఏపీఓ సుధారాణి తెలిపారు. వారు ఇచ్చిన వివరాల మేరకు నల్లపురెడ్డిపల్లెకు చెందిన ఉపాధి కూలీలు పనిచేసేందుకు ఆటోలో వెళుతుండగా ఆటో బోల్తాపడింది. ఇందులో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడపకు తరలించామన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీడీఓ, ఏపీఓ కడప రిమ్స్‌కు వెళ్లి పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. ఆటోలో 13 మంది కూలీలు ఉన్నారని వారిలో ముగ్గురికే గాయాలవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గాయాలపాలైన కూలీలకు న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు.

రైల్వేట్రాక్ నడుమ గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని శవం

రాజంపేట, జూన్ 14: రాజంపేట - హస్తవరం రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆకుపచ్చ చొక్కా పైన ఎర్ర, నల్లని చారలు కలిగిన వ్యక్తి ట్రాక్ పక్కనే మృతి చెందాడు. అటువైపు వెళుతున్న రేణిగుంట పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. వివరాలు తెలియరాలేదు.

వివాహిత ఆత్మహత్య

కలసపాడు, జూన్ 14: ఎగువరామాపురం వాసి అన్నవరం సుబ్బలక్షుమ్మ (45) అనారోగ్యంతో ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆమెకు కడుపు నొప్పి ఉండేదని, చికిత్స చేయించినా తగ్గకపోవడంతో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారన్నారు. మృతురాలికి భర్త శ్రీనివాసులు, ఏడేళ్ల కుమార్తె ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుగోపాల్

కడప (మారుతీనగర్) జూన్ 14: రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్‌డీఏ ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నిమిషాల్లోనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం హర్షణీయమని దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు శుక్రవారం పాతరిమ్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన భూ యాజమాన్యం హక్కుచట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) వలన రాష్ట్ర ప్రజానీకం వారి తాలూకు ఆస్తులపై అభద్రతాభావానికి గురయ్యారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టంలో పొందుపరచిన అనేక నిబంధనలు రాజ్యాంగానికి విరుద్ధంగా వున్నాయని, స్థిరాస్థిదారులు ఆ నిబంధనలు చూసి ఆస్తులు కోల్పోతామని ఆవేదన చెందారన్నారు. కాగా ఆ చట్టాన్ని రద్దుపరచాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయపక్షాలు, ప్రజాసంఘాలు పలు రూపాల్లో సుదీర్ఘకాలం గత ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజా ఆందోళనలు దృష్టిలో వుంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో సంతకంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. సమితి జిల్లా నేతలు యు. సం.జీవరాయుడు, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, లోకనాథం, సుబ్బరాయుడు, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వత్తిడిలో పోలీసులు

వేధిస్తున్న సిబ్బంది కొరత ● కలగా మారిన వారాంతపు సెలవులు
● పనిభారం, రాజకీయ వత్తిడితో నలిగిపోతున్న నాలుగో సింహం



కడప (క్రైం), జూన్ 14: 'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి ధర్మానికి ప్రతీకగా అయితే కనిపించని నాలుగో సింహమేరా ఈ పోలీస్..' అంటూ సినిమాలో డైలాగ్‌లకే పరిమితమైంది. నిజ జీవితంలో అధికార పార్టీకి అండగా ఉంటున్నారు. ఖద్దర్ నేతలు ఆదేశిస్తుంటే ఖాకీలు పాటిస్తున్నట్లు కనిపిస్తుంటోంది. సిబ్బంది కొరత కారణంగా పడిన వారికి డ్యూటీలు వేసుకుంటూ వెళుతున్నారు. ధర్నాలు, బంద్‌లు, బందోబస్తుల్లో వీఐపీ డ్యూటీలు, శాంతిభద్రతల పర్యవేక్షణ, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు, మంత్రులు, సార్వత్రిక ఎన్నికలు ఇలా ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు పోలీసు బందోబస్తు తప్పనిసరిగా మారుతుంది. దీంతో విధి నిర్వహణలో పోలీసులు తీవ్రంగా మానసిక వత్తిడిలో నలిగిపోతున్నారు. కనీసం వారాంతపు సెలవులంటూ తొలుత సీఎం ప్రకటించినా అది ఆచరణ శూన్యమేనని చెప్పవచ్చు. దీంతో వారికి విధులు మరింత భారమయ్యాయి. ఎస్పీ మొదలు హెడ్ కానిస్టేబుల్ వరకు సిబ్బంది ఉన్నా కానిస్టేబుల్‌లో మాత్రం వేధింపు స్పష్టంగా కనిపిస్తోందనే బహిరంగరహస్యమే. పోలీసు శాఖలో కానిస్టేబుల్ కీలకం ఒకరకంగా అధికార పర్యవేక్షణలో కానిస్టేబుల్ విధులు కీలకంగా మారుతుంది. డబుల్ డ్యూటీలతో అటు మానసిక ఇటు శారీరకంగా నలిగిపోతున్నారు. కడప జిల్లాను రెండు జిల్లాలుగా మారుస్తూ సిబ్బందిని కూడా కేటాయించారు. జగన్ సీఎం అయిన ఐదేళ్లలో కానిస్టేబుల్ ఎంపికలు జరగకపోవడం ఉన్న కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లగా పదోన్నతి కల్పించడంతో సిబ్బంది కొరత వేదిస్తోంది. ఉన్న సిబ్బంది రెండు మూడు డ్యూటీలు చేసుకుంటూ అనారోగ్యంతో సతమతమవుతున్నారు.

అమలు కాని వారాంతపు సెలవులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వం వచ్చిన వెంటనే కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు వారాంతపు సెలవులు ఇస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వైసీపీ పాలనలో పోలీసులకు వారాంతపు సెలవులు కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తమకు వారాంతపు సెలవులు ఇస్తే కుటుంబంతో కనీసం ఒక్కరోజైనా గడపవచ్చనే ఆనందం సిబ్బందిలో కన్పించింది. అవి అమలు కాకపోవడంతో వారిలో నిరాశే మిగిలింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఎస్పీ మొదలు కానిస్టేబుల్ వరకు పోలీసు విధులు నిర్వహిస్తున్నారు. అయితే కానిస్టేబుల్‌లో పూర్తి కొరత ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వైఎస్ఆర్ జిల్లాలో 50 పోలీసుస్టేషన్లు, ఒక సీసీఎస్, ఒక దిశ, రెండు పీసీఆర్, పోలీసు ట్రైనింగ్ కేంద్రం, రెండు ఫ్యాక్షన్‌జోన్, ఐదు సబ్‌డివిజన్లు ఉన్నాయి. సివిల్ విభాగంలో దాదాపు 500, ఏఆర్ విభాగంలో 200 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

హోంగార్డు, మహిళా పోలీసు ఎంపికలతోనే సరి

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కేవలం జిల్లాలో హోంగార్డు ఎంపికలు, సచివాలయంలో మహిళా పోలీసుల ఎంపికలు జరిగాయి. కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేసినా ఎంపికలు జరగకపోవడంతో ఐదేళ్లలో ఒక కానిస్టేబుల్ ఎంపికలు జరగకపోవడం ఖాళీల సంఖ్య మరింత పెరిగింది.

విభజన హామీలు సాధించాలి: సీపీఐ

రాయచోటిటౌన్, జూన్14: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా మారిన టీడీపీ నేతలు ఏపీ విభజన హామీలను సాధించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. టీడీపీ కేంద్రంలోని ఎన్డీఏలో కూడా కీలక భూమిక పోషిస్తోందన్నారు. గతంలో తిరుపతి వెంకన్న సాక్షిగా నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చ లేదన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన పరిష్కారం కాలేదని, కేంద్ర బడ్జెట్‌లో కూడా ఏపీకి తగు నిధులు కేటాయించలేదన్నారు. పైగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగ నమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. రైల్వే బడ్జెట్‌లో సైతం మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. కడప, బెంగుళూరు, రైల్వేలైను పాత అలైన్మెంట్ ప్రకారం పూర్తి చేయాలని, దానికి అవసరమైన నిధులు కేంద్రంతో విడుదల చేయించుకోవాలని టీడీపీని కోరారు. విభజన హామీలు, ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తదితర సమస్యలు పరిష్కారం చేయడానికి టీడీపీకి మంచి అవకాశం లభించిందన్నారు.





'త్వరలోనే అన్ని హామీల అమలు'

రాజంపేట, జూన్ 14 : అధికార బాధ్యతలను స్వీకరించిన తొలిరోజే ఐదు సంతకాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదర్శప్రాయుడని, మిగిలిన హామీలన్నీ త్వరలోనే పరిష్కరిస్తారని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగ ఉపాధ్యా యులకు వరంలాంటిదన్నారు. అన్న క్యాంటీన్ల‌తో పేదలకు అన్నం లభిస్తుందని తెలిపారు.. వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు కొనసాగాయని, చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో సంక్షేమం, అబివృద్ధి సమపాళ్ల లో ఉంటాయన్నారు. . ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, పట్టణ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, బాపనయ్యనాయుడు, పంటి వైద్యనిపుణులు డాక్టర్ నవీన్, గీతాంజలి కలాశాల కరస్పాండెంట్ ఎస్‌వి రమణ, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మహిళా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి, మేకా నరసింహులు, గుడారు విష్ణువర్ధన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

'ఆకలి బాధలు ఉండవు'

రాయచోటిటౌన్: చంద్రబాబు పరిపానలో పేద లకు ఆక లి బాధ ఉండదని, చరిత్రలో ఏ ము ఖ్యమంత్రి చేయని విధంగా ఒకే రోజు ఐదు కీలక ఫైళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకాలు చేయడమే కాకుండా రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించడంతో రా యచోటి ప్రాంత వాసుల చిరకాల కోరిక తీరిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బా షా అన్నారు. శుక్రవారం రాయచోటి పట్ట ణం లోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాలతో అభిషేకం చేసి కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి హయాంలో యువత మోసపోయా రన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్‌రెడ్డి, బసిరెడ్డి, ఆనంద రెడ్డి, శివారెడ్డి, షైనుద్దీన్, సుల్తాన్, ఖాదర్ మొహిద్దీన్ అండ్ సన్స్, మహమ్మద్ అలీ, షరీఫ్, అతావుల్లా, అమీర్, వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.


రాయచోటి: కేక్ కట్ చేస్తున్న గాజుల ఖాదర్‌బాషా

విద్యార్థులు సవాళ్లను అధిగమించాలి

రైల్వేకోడూరు, జూన్ 14: విద్యార్థులు సవాళ్లను ఎదుర్కోనాలని ఉద్యాన కళాశాల అసోషియేట్ డీన్ కే. గోపాల్, మంగంటపేట బెరైటీస్ ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కళాశాల ఓఎస్‌డీ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, ఆచార్యులు స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూళ్లలో అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్

సుండుపల్లె, జూన్14: రాష్ట్రంలో ఉర్దూ స్కూల్ పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రభుత్వం స్పెషల్ డ్రైవర్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీఎంవో (ఉర్దూ) సమీయుల్లాఖాన్, షేక్ మహమ్మద్ హషీం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉర్దూ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపా ధ్యాయులకు సూచించారు. జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ తిమ్మ'సముద్రం, జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మడితాడును సందర్శించారు. తిమ్మసముద్రం, మడితాడు ప్రధానోపాధ్యాయులు ఆరిఫుల్లా, అబిదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తెస్తాం

సంబే పల్లె, జూన్ 14: ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఎ ప్లాంట్ వద్ద స్థానిక నాయకులతో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ సజల స్రవంతి పథకాన్ని వదిలేశారని తెలిపారు.

చెయ్యేటిలో ఇసుక నిల్వల తనిఖీ

పెనగలూరు, జూన్ 14 : మండలంలోని నారాయణనెల్లూరు వద్ద చెయ్యేటిలో ఇసుక వాస్తవ పరిస్థితిని శుక్రవారం మండలశాఖ అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నారాయణ నెల్లూరు ఇసుక క్వారీల్లో ఇసుక తరలింపును అధికారులు నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15 రోజులకొకసారి ఇసుక వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు పంపడంతో శుక్రవారం మండలశాఖ అధికారులు పరిశీలించారు.

మైనింగ్ అధికారులపై చర్యలకు డీడీఎంఎస్ ఆదేశాలు

ఓబులవారిపల్లె, జూన్ 14 : మంగంపేట ఏపీఎండీసీలో అనుభవం లేనివారితో మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలకు డీడీఎంఎస్ అధికారులు ఆదేశించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. కార్మికులకు రక్షణ కల్పించాలని అర్హత కలిగిన అధికారులను నియమించాలని ఏప్రిల్ 30న మైనింగ్ సేఫ్టీ అధికారులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ నెల్లూరు రీజియన్ డీడీఎంఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి మే 20న విచారణ అధికారి కోటంనాయుడు మంగంపేట మైన్స్‌ను సందర్శించి ఫిర్యాదుదారు చంద్రశేఖర్‌తో కలిసి మైనింగ్ అధికారులను విచారించి, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులోని అంశాలు వాస్తవమే అని తేలడంతో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రీజియన్ మైన్స్ సేఫ్టీ అధికారి రఘుపతి పెద్దరెడ్డి ఆదేశించారు. ఈ విషయం తనకు పోస్టుద్వారా తెలియజేసినట్లు సీహెచ్ చంద్రశేఖర్ వివరించారు.

'హామీలు నెరవేరుస్తాం'

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 14: మైనారిటీలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని రైల్వేకోడూరు యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో మండల మైనారిటీ నాయకులు పటాన్ మౌలా, షేక్ మస్తాన్ టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ జుబేర్, సయ్యద్ మను ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపు కోసం కృషి చేసిన మైనారిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ నాయకులు మొహమ్మద్ బాషా, షేక్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది రక్తదానం

సుండుపల్లె, జూన్14: రక్తదానం మహాపుణ్యకార్యం అని ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పవర్ జిమ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 40 మంది యువకులకు అభినందనలు తెలియజేశారు. డాక్టర్ సయ్యద్ అహ్మద్, రెడ్డిరాణి, ఓబులేసు, రమేశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్కిరెడ్డిపల్లె జూన్ 14; స్థానిక మూడు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి డాక్టర్ షఫీనాయక్, ఆరీవుల్లా ఆద్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .రాబోయే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం లేకుండా చేస్తారన్నారు. వృద్ధుల పెన్షన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచిన ఘన త చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రాన్ని ఇక స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా తీర్చుదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పక్కీరయ్య, నసరోద్దిన్ , రవికుమార్, వేణు, రెడ్డిశేఖర్, ప్రసాదు, అహ్మద్, అలీపీర్, మౌలా, శివశంకర్, గోపాల్, వెంకటేసు, శివరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: సామాజిక పెన్షన్ల మొత్తం పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ వృద్ధులు బాబు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. రాజంపేట మండలం మిట్ట హరిజనవాడలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో పెన్షన్ తీసుకుంటున్న వృద్ధులు బాబు చిత్రపటానికి పాలతో భిషేకం చేసి, చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కొల్లావారిపల్లె సర్పంచ్ మహేష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 14: సబ్‌స్టేషన్లలతో మరమ్మతుల కారణంగా రైల్వేకోడూరు పట్టణం, శెట్టిగుంట, పంచాయతీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఓబులవారిపల్లె మండలంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి ఎం.భాస్కర్ రావు తెలిపారు కనుక వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం

రైల్వేకోడూరు, జూన్ 14: కొత్తకోడూరులో గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం గంగమ్మను నిమజ్జనం చేశారు. కొత్తకోడూరు, రైల్వేకోడూరు, రెడ్డివారిపల్లె, గుండాలపల్లె, పగడాలపల్లె, కామిశెట్టినగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చెన్నంశెట్టి కుమార్, కొత్తకోడూరు ప్రజలు చర్యలు తీసుకున్నారు.

అంగన్వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

చిట్వేలి, జూన్ 14 :ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని చిట్వేలి, పెనగలూరు మండలాల అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేట్ డే నిర్వహించారు. మూడు నుంచి ఐదేళ్లు పూర్తి చేసుకున్న బాల బాలికల తలపై టోపీ, చేతిలో సర్టిఫికెట్ ఇచ్చి, పై తరగతికి వెళుతున్నారనే స్పృహను కలిగించి తద్వారా వారిలోని సృజనాత్మకతను పెంపొందించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో రాజేశ్వరి తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటల విద్య ద్వారా అక్షరాలను, అంకెలను, పదాలను పరిచయం చేస్తామన్నారు. పౌష్టికాహారం అందిస్తామన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి!

రాయచోటి టౌన్, జూన్ 14: వైద్యుల నిర్లక్ష్యంతో ఓ బాలింత మృతి చెందినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు చక్రాయపేటకు చెందిన ఈశ్వరమ్మ కూతురు జ్యోతి(20)ని ప్రసవం కోసం రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా, వైద్యులు ఆమెకు సిజేరియన్ చేశారు. దాంతో ఆమె ఆరోగ్యం విషమించగా ఆమె బంధువులకు సమాచారం ఇవ్వకుండానే మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల నిరక్ష్యంతో ఆమె మరణించింది. దానికి తోడు రూ.40 వేలు ఇస్తేగానీ మృతదేహాన్ని ఇవ్వమని ఆస్పత్రి వర్గాలు చెప్పడంతో బంధువులు రాయచోటి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సరికొత్త హంగులతో జోయాలుక్కాస్

కడప (మారుతీనగర్), జూన్ 14: కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలో పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ షోరూంను శుక్రవారం సరికొత్త హంగులతో తిరిగి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ సురేశ్‌బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అధునాతన డిజైన్లతో మహిళలను విశేషంగా ఆకట్టుకుంటూ జోయాలుక్కాస్ ప్రపంచవ్యాప్తంగా 160 షో రూంలను ఏర్పాటు చేసిందన్నారు. మన రాష్ట్రంలో సుమారు 70 శాతం మంది ప్రజలు జోయాలుక్కాస్ షోరూంలోనే బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. అంతగా తెలుగు ప్రజల ఆదరాభిమానాలను జోయాలుక్కాస్ బంగారం చూరగొన్నదన్నారు. ఆ ఉత్సాహంతో కడపలో రెండవ ఫ్లోర్‌లో కూడా వ్యాపారసముదాయం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యు మాట్లాడుతూ తమ షోరూంలో గోల్డ్ డైమండ్స్ సిల్వర్ జ్యువెలరీ, మిగతా అన్ని మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50 శాతం ప్రారంభోత్సవపు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్ జులై 14 వరకూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సినీ నటి పసుపులేటి రేష్మ, జోయాలుక్కాస్ సీఓఓ హెన్రీజార్జి, రీటైల్ మేనేజర్ రాజేశ్‌క్రిష్ణన్, మార్కెటింగ్ డీజీఎం ఆనిశ్‌వార్గెష్‌తో పాటు పలువురు సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు



జోయాలుక్కాస్ షోరూం పునఃప్రారంభోత్సవ దృశ్యం

మంత్రులకు నేతల శుభాకాంక్షలు

రాజంపేట టౌన్, జూన్ 14 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమితులైన తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడును శుక్రవారం ఆయన స్వగృహంలో అన్నమయ్య జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చమర్తి సురేష్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, బీజేపీ పార్లమెంట్ నాయకులు చమర్తి మహేష్‌రాజు, గోరాన్ చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంతగాని

నందలూరు: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, లేబాక సర్పంచ్ లంకయ్యగారి వెంకటనరసయ్య, ఎల్లంరాజుపల్లె సుబ్బారెడ్డి, రాము యాదవ్, సాతపల్లె వెంకటేశ్ పాల్గొన్నారు.

రాజంపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ అంచలంచెలుగా ఎదిగిన సత్యకుమార్ ధర్మవరం ఎమ్మెల్యేగా, వెనువెంటనే రాష్ట్ర మంత్రిగా నియమితులు కావడం ఆనందదాయకమన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేసినందుకు అభినందించినట్లు తెలిపారు. అనంతరం నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాంప్రసాద్ రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, సవిత, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనితను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు.



వరసిద్ధుడి సేవలో సాయిధరమ్‌తేజ్



ఐరాల(కాణిపాకం), జూన్ 14: సినీ హీరో సాయిధరమ్‌తేజ్ శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి అయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు రాజ్‌కుమార్, యోగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడికి
వైజాగ్‌వాసి గుండె
'హృదయాలయం'లో 15వ శస్త్రచికిత్స



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 14: ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడి(22)కి బ్రెయిన్‌డెడ్‌కి గురైన వైజాగ్‌కి చెందిన వ్యక్తి (39) గుండెను అమర్చే శస్త్రచికిత్స తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో శుక్రవారం జరిగింది. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో 14 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఇది 15వ శస్త్ర చికిత్స అని వైద్యులు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స పూర్తవడానికి ఆరు గంటలకుపైగా పడుతుందని పేర్కొన్నారు.

ఆ కుక్కలు దొరికాయి



ముదోల్‌హౌండ్ డాగ్స్‌తో నరేష్

పలమనేరు, జూన్ 14: పలమనేరు సమీపం గంటావూరు ఫ్లైఓవర్ వద్ద నివాసముంటున్న టమోటా మండీ వ్యాపారి నరేష్ పెంచుకొంటున్న అత్యంత ఖరీదైన రెండు ముదోల్‌హౌండ్ డాగ్స్ దొరికాయి. మూడురోజుల క్రితం వరండాలో ఉన్న వీటిని దుండగులు అపహరించుకెళ్లారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సోషల్ మీడియా ద్వారా ఈ కుక్కల ఆచూకీ బయటపడింది. అదెలా గంటే.. బైరెడ్డిపల్లె మండలం కంచనపల్లికి చెందిన ఒక వ్యక్తి ఈ కుక్కలను తీసుకువెళ్లి రూ. అదేమండలం కామినేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి 2 వేలకు అమ్మేశాడు. అతడు వీటిని పుంగనూరుకు చెందిన వ్యక్తికి రూ.5వేలకు అమ్మాడు. పుంగనూరుకు చెందిన వ్యక్తి తన వద్ద అరుదైన జాతికి చెందిన కుక్కలు అమ్మకానికి ఉన్నట్లు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. ఈ విషయం నరేష్ దృష్టికి రాగా పుంగనూరుకు చెందిన వ్యక్తిని గుర్తించి నిలదీయడంతో ఈ డొంకంతా కదిలింది. ఇలా ముదోల్‌హౌండ్ కుక్కలు దొరికాయి.

పార్సిల్ సర్వీసు కార్యాలయంలో రూ.2.13 లక్షల చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14: లీలామహల్ సమీపంలో గురువారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు షట్టర్ పగులగొట్టి రూ.2.13 లక్షలు అపహరించుకుపోయారు. అలిపిరి సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. లీలామహల్ సెంటర్‌లో పార్సిల్ సర్వీసు కార్యాలయం ఉంది. రోజూ కొరియర్ డెలివరీ బాయ్‌లు తెచ్చే నగదును కార్యాలయంలో ఉంచుతారు. గురువారం కొరియర్ ద్వారా వసూలైన దాదాపు రూ.2.13 లక్షలను ఎప్పటిలాగే బీరువాలో భద్రపరచి తాళం వేసి వెళ్లారు. గమనించిన దుండగులు అర్ధరాత్రి ఇనుప రాడ్లతో షట్టర్ పగుల గొట్టి.. బీరువాలోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లోడ్ వస్తుందని సిబ్బంది విధులకు హాజరయ్యారు. షట్టర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నేతృత్వంలో క్లూస్ టీం, ఫ్రింగర్ ప్రింట్ అధికారులు చేరుకుని ఆధారాలు సేకరించారు. టీం లీడర్ చరిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృత వర్సిటీ పీఆర్వోగా రమేష్‌బాబు

తిరుపతి రూరల్, జూన్ 14: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ పీఆర్వోగా గణిత విభాగ ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటివరకు పీఆర్వోగా విశిష్టాద్వైత వేదాంత విభాగ ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి రాఘవన్ వ్యవహరించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రమేష్‌బాబు పీఆర్వోగా కొనసాగనున్నారు. రాఘవన్ మాట్లాడుతూ వర్సిటీలో ఉన్నతాధికార వర్గాలు, ప్రొఫెసర్లు, సిబ్బంది సమన్వయంతో స్నాతకోత్సవం, వార్షికోత్సవాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందుడి ఆలయంలో పుష్పయాగం



తిరుపతి (కల్చరల్), జూన్ 14: గోవిందరాజ స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వేడుకగా పుష్పయాగం జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్ధన రెడ్డి, ఏఈవో మునికృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పురుగులున్న నీళ్లు మీరు తాగుతారా..?

అధికారులపై మండిపడి పది నిమిషాల్లో ట్యాంకర్లు తెప్పించిన పూతలపట్టు ఎమ్మెల్యే



మురళీమోహన్‌కు సమస్యలు విన్నవిస్తున్న అధికారులు

పూతలపట్టు, జూన్ 14: 'పురుగులున్న తాగునీటిని మీరైతే తాగుతారా...? సామాన్య ప్రజలంటే మీకు అలుసా...' అంటూ మండల అధికారులపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మండిపడ్డారు. నీటి సరఫరా విషయంలో రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండల కేంద్రంలోని పక్కాలగుట్టలో టీడీపీ సానుభూతిపరులకు నీళ్ల వదలడం లేదని తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. 15 రోజులుగా నీళ్ల వదలడం లేదని, పురుగులు పడ్డ నీటిని తాగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. రెండ్రోజుల్లోపు నీటి ట్యాంకర్లను శుభ్రం చేసి, రోజూ నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. కమ్మగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని పేటపల్లి గ్రామంలో స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, నేతాజీ, విజయలక్ష్మి, చిరంజీవి, హిమకర్ నాయుడు, దగ్గుపాటి మోహన్, ప్రమోద్, శేషాద్రి నాయుడు, నల్లబోతు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో టీడీపీ కార్యకర్త మృతి



లింగయ్య (ఫైల్ ఫొటో)



లింగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పుంగనూరు రూరల్, జూన్ 14: రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. ఏం జరిగిందో ఏమో గానీ.. ఉదయానికి మృతిచెంది ఉన్నారు. ఇలా అనుమానాస్పద స్థితిలో టీడీపీ కార్యకర్త లింగయ్య మృతి చెందిన ఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. మండలంలోని ఆరడిగుంటకు చెందిన లింగయ్య(40) టీడీపీ కార్యకర్త. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంట్లో వాళ్లు నిద్రలేచి చూడగా లింగయ్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెదికారు. గ్రామ సమీపంలోని సచివాలయం వద్ద లింగప్ప మృతిచెంది ఉండగా గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులకు, టీడీపీ నాయకులకు కుటుబీకులు సమాచారం తెలియజేశారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లింగయ్య మృతిపై ఆరా తీశారు. అప్పటికే నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, రెడ్డెప్పనాయుడు, ప్రసాద్‌స్వామితో పాటు పెద్దఎత్తున శ్రేణుల అక్కడికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లింగయ్య భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్యమనస్కంగానే...

● వైసీపీ భక్త అధికారుల్లో గుబులు ● స్థాన చలనం తప్పదనే ఆందోళన
● ఎమ్మెల్యే గుడ్ లుక్స్ కోసం పాట్లు ● గాడిన పడని పాలన

పుత్తూరు అర్బన్, జూన్ 14: పుత్తూరులో అధికారులు అన్య మనస్కంగా విధులు నిర్వహిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.ఎన్నికలవిధులుల్లో భాగంగా బదిలీపై వచ్చిన అధికారులు ఆ ఘట్టం కాస్తా పూర్తి కావడంతో తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారు. మరోవైపు వైసీపీ భక్త అధికారుల్లో బదిలీల భయం పట్టుకుంది. ఐదేళ్ల రూల్ ఆఫ్ లాకు విరుద్ధంగా వైసీపీ పెద్దల మోముల్లో ఆనందం చూడడమే విధులుగా భావించిన అధికారులు ఇక తమకు స్థానచలనం తప్పదనే అంచనాకు వచ్చేశారు. చివరి ప్రయత్నంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్ లుక్స్ కోసం స్థానిక టీడీపీ నాయకుల చుట్టూ ప్రదిక్షణం చేస్తున్నారు.ఈసంఘర్షణల నడుమ రోజువారీ విధులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిర్లిప్తంగా విధులు

ఎన్నికల విధుల్లో భాగంగా పుత్తూరు బదిలీపై వచ్చిన ఒక రెవెన్యూ అధికారి రోజువారీ వచ్చే ప్రజల విజ్ఞాపనలు, సమస్యలను కూడా పరిష్కరించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఒక పోలీస్ అధికారి కూడా ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించ డంలేదనే మాటలు వినబడుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు అంటున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఒక అధికారి ఇక తనకు బదిలీ తప్పదనే అంచనాకు వచ్చి విధులకు సక్రమంగా హాజరు కావడంలేదనే చర్చ జరుగుతోంది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, నందిమంగళంలో ఇటీవల అతిసారా ప్రబలడానికి కారణమైందనే వాదనలు కూడా ఉన్నాయి. అలాగే తనకు ఎలాగూ జూలైలో ప్రమోషన్‌పై బదిలీ తప్పదని తెలుసుకున్న టౌన్ ప్లానింగ్‌కు చెందిన ఒక అధికారి విధి నిర్వహణ పట్ల పెద్దగా ఆసక్తి కనబరచడంలేదు. పైగా ఆమ్యామ్యాలు వచ్చే ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల తీరు కారణంగా పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

ఎమ్మెల్యే గుడ్‌లుక్స్ కోసం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్‌లుక్స్ కోసం కొందరు కీలక అధికారులు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. దీనికి స్థానిక టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అంతరంగికం తెలిసిన ఆ నాయకులు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నట్లు సమాచారం. రెండు రోజుల నుంచి తిరుపతిలో ఎమ్మెల్యే ఇంటికి అధికార యంత్రాంగం క్యూ కట్టింది. విడతల వారీగా అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ వీర భక్త అధికారులను తప్ప సాధారణ ఉద్యోగులను ఆప్యాయంగా పలకరిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీకి చెందిన కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేని కలవగా 'ఎలాంటి ఇబ్బంది లు ఉండవు... ప్రశాంతంగా విధులు నిర్వహించుకోండి' అని చెప్పినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా అధికారులు, ఉద్యోగులు అయితే ఆయన రిసీవ్ చేసుకున్న తీరుతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నరకం చూశామని, ఇప్పుడు ఎమ్మెల్యే అండగా ఉంటాననే భరోసా కల్పిస్తుండడంతో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని వారు ఆఫ్ ద రికార్డు పేర్కొంటున్నారు. మొత్తానికి వైసీపీ వీర భక్త అధికారుల్లో గుబులు మొదలవ్వగా, మిగిలిన సాధారణ ఉద్యోగుల్లో మాత్రం ఆనందం తొణికిసలాడుతోందనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ అంటకాగిన ఉద్యోగులను పక్కనబెట్టి పాలన గాడిన పడేందుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కసరత్తు మొదలుపెట్టాలనే అభిప్రాయాలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతోంది.

మామిడి కాయల ట్రాక్టర్ బోల్తా





ట్రాలీ పైకిలేవడంతో బోల్తాపడిన ట్రాక్టరు

శ్రీరంగరాజపురం, జూన్ 14: మామిడి కాయల లోడ్‌తో స్పీడుగా వస్తోందా ట్రాక్టరు. ఇంతలో ఏం జరిగిందో గానీ హైడ్రాలిక్ ద్వారా ట్రాలీ పైకి లేచి.. ట్రాక్టరు నుంచి విడిపోయింది. ఈ ఘటనతో అదుపు తప్పిన ట్రాక్టరు బోల్తా పడింది. అందరూ చూస్తుండగానే.. క్షణాల్లో ఇలా ట్రాక్టరు బోల్తా పడటం.. స్వల్పగాయాలతో డ్రైవరు బయట పడటం జరిగిపోయింది. ఈ ఘటన శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎస్ఆర్ పురం మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన రైతు ట్రాక్టరులో మామిడి కాయల లోడ్‌తో 49.కొత్తపల్లెమిట్టకు బయలుదేరారు. మార్గమధ్యంలో తిరుపతి రోడ్డుపై వస్తుండగా ట్రాలీ పైకి లేచి.. విడిపోవడంతో ట్రాక్టరు బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. కాగా, 49.కొత్తపల్లెమిట్టలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారి పక్కన అనుమతి లేకుండా అయిదు చోట్ల ర్యాంపులో మామిడి కాయలను విక్రయిస్తున్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

17మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 14: జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 17 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సోమలలో 13.8మి.మీ, నింద్ర 10.2, గంగవరం 9.4, తవణంపల్లె 7.4, రామకుప్పం 6.8, రొంపిచెర్ల 6.2, పుంగనూరు 6.2, బంగారుపాళ్యం 5.8, సదుం 5.2, చౌడేపల్లి 4.2, పెద్దపంజాణి 3.4, పలమనేరు 3.0, యాదమరి 3.0, పూతలపట్టు 2.4, చిత్తూరు రూరల్ 1.6, చిత్తూరు అర్బన్ 1.2, గంగాధరనెల్లూరు 1.0 మి.మీ నమోదైంది.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు

● గుత్తార్లపల్లెలో పరిశీలించిన రెవెన్యూ అధికారులు



గుడుపల్లె, జూన్ 13: గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెలో గ్రానైట్ అక్రమ తవ్వకం ప్రాంతాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌కు అడ్డుకట్ట వేయాలని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. కాగా, తహసీల్దారు సయ్యద్ షెబుద్దీన్ ఆదేశాలతో డీటీ కిరణ్ కుమార్ నాయక్, రెవెన్యూ అధికారుల బృందం నక్కనపల్లె రెవెన్యూలో సర్వే నెం.62లోని గుట్ట పొరంబోకు భూమిలో అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలనకు వెళ్లారు. అక్కడకు రెవెన్యూ అధికారులు వస్తున్నారని తెలుసుకున్న అక్రమార్కులు మైనింగ్‌కు ఉపయోగించే యంత్రాలను తీసుకెళ్లిపోయారు. అధికారులు గుట్ట పొరంబోకు భూమిలో రాతి సంపదను అక్రమార్కులు ఎక్కువ మొత్తంలో తరలించారని వారు గుర్తించారు. ఆ భూమిలో అక్రమార్కులు మైనింగ్‌కు వెళ్లే దారిలో ట్రంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ చేపడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఈ పనులపై సమీక్షించారు. నీటి సరఫరా, భూసేకరణ, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆర్డీవో పెంచలకిషోర్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి మధుసూదన్‌రావు, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

● జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: తిరుపతి జిల్లాలోని 11 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 5,518మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం 11 మంది లోకల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 11మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు జిల్లా అధికారులకు సమన్వయ అధికారులుగా బాధ్యతలు కేటాయించామన్నారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్లు(9000665565, 9676928804) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరన్నారు. ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి పాపాలపై విచారణ కమిటీ నియమించాలి

● బాధితులకు న్యాయం చేసి దోషులను శిక్షించాలి
● సీఎం చంద్రబాబుకు రామచంద్రయాదవ్ లేఖ

పుంగనూరు, జూన్ 14: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అక్రమాలు, ఆరాచకాలు, దోపిడీ తదితర పాపాలపై విచారణ కమిటీ ద్వారా నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్లు బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం చారిత్రాత్మకమని, సీఎం చంద్రబాబునాయుడుతో బాటు కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజ్యాంగేతర శక్తిగా రాష్ట్రంలో గనులు, క్వారీలు దోపిడీ, దాడులు, అరాచకాలు, అన్యాయం, అక్రమాలు, విద్యుత్ శాఖలో కాంట్రాక్టులు, ఒప్పందాలు, కేటాయింపులుపై ప్రత్యేక కమిటీ వేసి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పుంగనూరు, కుప్పం, పలమనేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిల్లో తన అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆరాచకాలు చేస్తూ ముడా అథారిటీని అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి కుటుంబీకులు, అనుచరులు చేసిన భూకబ్జాలు, ఆగడాలపై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేయాని కోరినట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రతిపక్షపార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేలాదిమందిని వేధించినట్లు తెలిపారు. పెద్దిరెడ్డి అవినీతితో దోచుకున్నది కక్కించాలని, బాధితులకు న్యాయం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు వివరించారు.

ప్రభుత్వాస్పత్రిని వీడని నిర్లక్ష్యపు రోగం

● ఐదేళ్ల పాటు వైసీపీతో అంటకాగిన అధికారులు
● అదనపు అంతస్థు పేరుతో భారీ అవినీతి
● ప్రభుత్వం మారడంతో ప్రక్షాళనపై రోగుల ఆశలు





నిర్మాణం పూర్తి కాని లిఫ్ట్ పనులు - ప్రభుత్వాస్పత్రిలో అధ్వానంగా ఉన్న రోడ్లు

శ్రీకాళహస్తి, జూన్ 14: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి ఒక దశలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్‌కు ధీటుగా ఖరీదైన వైద్యాన్ని గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనతో ఆస్పత్రికి నిర్లక్ష్యపు రోగం అలుముకుంది. వైసీపీ పాలకులతో కొందరు అధికారులు అంటకాగుతూ రోగులకు కనీస వైద్య సేవలను అందించకుండా విస్మరించారు. నాడు-నేడు పనులతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామంటూ వైసీపీ నేతలు ప్రకటిం చారు. తీరా ఒక అదనపు అంతస్తును నాసిరకం పనులతో నిర్మించి చేతులు దులుపుకున్నారు. తప్పును నిలదీయాల్సిన కొందరు అధికారులు వైసీపీతో అంటకాగి వారి పాపాలన్నింటిలో పాలుపంచుకుని ప్రస్తుతం ఏమి తెలియని అమయాకుల్లా చలామణి అవుతున్నారు.

మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతిష్టాత్మకంగా 1999లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని నెలకొల్పారు. కార్పొరేట్‌కు ధీటుగా పేదలకు వైద్యసేవలు అందించాలన్న ఆశయంతో పదేళ్ల క్రితం గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆస్పత్రిని దత్తత తీసుకున్నారు. అధునాతన యంత్రాలు, పరికరాలతో ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధునాతన వైద్యసేవలు అందుతుండడంతో నియోజకవర్గం నుంచే కాకుండా పొరుగు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పేదలు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చేవారు. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకసారిగా ఆస్పత్రిపై అవినీతి గ్రహణం అలుముకుంది. ధనార్జనే ధ్యేయంగా నాడు-నేడు పేరుతో పనులు చేపట్టారు. అత్యంత నాసిరకంగా ఒక అదనపు అంతస్థు మాత్రం నిర్మించి మమ అనిపించారు. అసలు వర్క్ ఆర్డరులో ఏయే పనులు చేయాలని నిర్దేశించారో బయటకు వెల్లడించలేదు. అధికారులు, పాలకులు కలిసి గూడుపుఠాని సాగించారు. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా లిఫ్టు నిర్మించాలి. కానీ ఆ పని పూర్తి చేయలేదు. వర్క్ ఆర్డర్ ప్రకారం 24 ఏసీలు అమర్చాల్సి ఉండగా కానీ పాత ఏసీలతో కలిపితే ఆస్పత్రి భవనంలో కేవలం 14 ఏసీలు మాత్రమే ఉన్నట్లు అంచనా. అధికారులు, పాలకులు కలిసి సుమారు పది ఏసీలను సొంత అవసరాలకు తరలించుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో తారురోడ్లు అత్యంత దయనీయంగా దర్శనమిస్తున్నాయి. నాడు నేడు పనులు చేపట్టినా ఆస్పత్రిలో రోడ్లపై పిడికెడు కంకర దుమ్ము కూడా విదల్చలేదు. రూ.12కోట్ల నిధులతో కనీసం రోడ్లు లేకుండా ఏం అభివృద్ధి చేశారని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపించే అంశాలు మాత్రమే. ఇక వర్క్‌ఆర్డరులో లోతుగా తోడితే నాడునేడు భారీగా అవినీతి వెలుగు చుసే అవకాశం ఉంది. చాలా వరకు పరికరాలు, ఇతర వసతులు, సౌకర్యాలు కల్పించకుండా నిధులను బొక్కేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతితో పాటు గాడి తప్పిన ఆస్పత్రి పాలన వైద్యసేవలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉందని ప్రజలు ప్రాధేయపడుతున్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

కలికిరి, జూన్ 14: కలికిరిలో ఓ ఇంటికి రంగులు వేసే పనిలో నిమగ్నమైన మురళి (45) అనే పెయింటర్ విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. పీలేరు మండలం మేకలవానికాలువ గ్రామానికి చెందిన మురళి కలికిరి బీడీ కాలనీలోని ఒక ఇంటికి శుక్రవారం రంగులు వేస్తుండగా ఒక ఇనుప కమ్మీ దగ్గరలోని విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో అతను భవనం పై నుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మురళి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కలికిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, జూన్14: నిమ్మనపల్లె మండలం ఎగువ మాచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం సొంత పనిపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ విషయంగా పోలీసులకు సమాచారం లేదన్నారు. మృత దేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లిపోయారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జూన్14: పురుగుల మందు తాగి కరీమ్‌బాషా (21) అనే యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మరకు మదనపల్లె మండలం, కొత్తపల్లె గ్రామం కొత్తయిండ్లకు చెందిన కరీమ్‌బాషాను జులాయిగా తిరుగుతున్నాడని కుటుంబసభ్యులు మందలించడంతో గురువారం రాత్రి పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా మెరుగైన వైద్యంకోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి బయలుదేరి వెళ్లి వారు అక్కడ వైద్యం చేయించకుండానే మదనపల్లెకు తిరుగుప్రయాణంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు తాలుకా సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్యం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు

విద్యుఘాతానికి గురై పాడి ఆవులు మృతి

కలకడ, జూన్ 14:మండలంలోని కోపూరివాండ్లపల్లెకు చెందిన శ్రీనివాసులనాయుడుకు చెందిన రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. ఆయన సొంత పొలం వద్దకు మేత మేయడానికి వెళ్లిన ఆవులు విద్యుత్ తీగలు నేలకు తాకి ఉండడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆవులు మృతితో రూ.1.80 లక్షల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించండి

తంబళ్లపల్లె, జూన్ 14: తంబళ్లపల్లె మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆర్డీవో తహసీల్దారు బ్రహ్మయ్యతో కలసి తంబళ్లపల్లెకు సమీపంలోని పెద్దమండ్యం రహదారిలో నిర్మిస్తున్న టపాసుల దుకాణ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ...విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమగు ధృవపత్రాలను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకట్రమణ, భద్ర, రమణ, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం

తంబళ్లపల్లె, జూన్ 14: ములకలచెరువులో టీడీపీ జెండా కడుతుండగా గాయపడిన టీడీపీ కార్యకర్త సుసేల్‌కు తెలుగుయువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర శుక్రవారం రూ.5వేలు ఆర్థికసాయం అందచేశారు. టీడీపీ తరుపున అండగా నిలబడి ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, నారాయణరెడ్డి, షేక్‌చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్కిరెడ్డిపల్లె జూన్ 14; స్థానిక మూడు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి డాక్టర్ షఫీనాయక్, ఆరీవుల్లా ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .రాబోయే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగం లేకుండా చేస్తారన్నారు. వృద్ధుల పెన్షన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచిన ఘన త చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రాన్ని ఇక స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చుదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పక్కీరయ్య, నసరోద్దిన్ , రవికుమార్, వేణు, రెడ్డిశేఖర్, ప్రసాదు, అహ్మద్, అలీపీర్, మౌలా, శివశంకర్, గోపాల్, వెంకటేసు, శివరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. రాజంపేట: సామాజిక పెన్షన్ల మొత్తం పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ వృద్ధులు బాబు చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. రాజంపేట మండలం మిట్ట హరిజనవాడలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో పెన్షన్ తీసుకుంటున్న వృద్ధులు బాబు చిత్రపటానికి పాలతో భిషేకం చేసి, చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కొల్లావారిపల్లె సర్పంచ్ మహేష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 14: సబ్‌స్టేషన్లలతో మరమ్మతుల కారణంగా రైల్వేకోడూరు పట్టణం, శెట్టిగుంట, పంచాయతీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఓబులవారిపల్లె మండలంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి ఎం.భాస్కర్ రావు తెలిపారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం

రైల్వేకోడూరు, జూన్ 14: కొత్తకోడూరులో గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం గంగమ్మను నిమజ్జనం చేశారు. కొత్తకోడూరు, రైల్వేకోడూరు, రెడ్డివారిపల్లె, గుండాలపల్లె, పగడాలపల్లె, కామి శెట్టినగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చెన్నంశెట్టి కుమార్, కొత్తకోడూరు ప్రజలు చర్యలు తీసుకున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి!

రాయచోటి టౌన్, జూన్ 14: వైద్యుల నిర్లక్ష్యంతో ఓ బాలింత మృతి చెందినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు చక్రాయపేటకు చెందిన ఈశ్వరమ్మ కూతురు జ్యోతి(20)ని ప్రసవం కోసం రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా, వైద్యులు ఆమెకు సిజేరియన్ చేశారు. దాంతో ఆమె ఆరోగ్యం విషమించగా ఆమె బంధువులకు సమాచారం ఇవ్వకుండానే మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల నిరక్ష్యంతో ఆమె మరణించింది. దానికి తోడు రూ.40 వేలు ఇస్తేగానీ మృతదేహాన్ని ఇవ్వమని ఆస్పత్రి వర్గాలు చెప్పడంతో బంధువులు రాయచోటి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అంగన్వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

చిట్వేలి, జూన్ 14 :ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని చిట్వేలి, పెనగలూరు మండలాల అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేట్ డే నిర్వహించారు. మూడు నుంచి ఐదేళ్ల పూర్తి చేసుకున్న బాల బాలికల తలపై టోపీ, చేతిలో సర్టిఫికెట్ ఇచ్చి. పై తరగతికి వెళుతున్నారనే స్పృహను కలిగించి తద్వారా వారిలోని సృజనాత్మకతను పెంపొందించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో రాజేశ్వరి తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటల విద్య ద్వారా అక్షరాలను, అంకెలను, పదాలను పరిచయం చేస్తామన్నారు.

తొలి రోజే ఐదు సంతకాలు చారిత్రాత్మకం

● మెగాడీఎస్సీ సంతకంతో చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు ● ప్రజలకు మేలు చేయడమే చంద్రబాబు లక్ష్యం ● టీడీపీ శ్రేణులు



ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, పాలగిరి సిద్ధా



గంగమ్మ ఆలయం వద్ద టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్న తెలుగు యువత నేతలు

ములకలచెరువు, జూన్ 14: నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మొదటి రోజే ఐదు చారిత్రాత్మక ఫైళ్లపై సంతకాలు చేశారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టి ఇచ్చిన మాట ప్రకారం ఐదు హామీలపై సంతకాలు చేయడంతో శుక్రవారం ములకలచెరువులో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. టీడీపీ నేత జయచంద్రారెడ్డి కేక్‌ను కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ ఫైళ్లపై సంతకాలు చేసి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మెజార్టీ సీట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు మేలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునే ప్రజల కోసం తపన పడ్డ ఏకైక సీఎం చంద్రబాబునాయుడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు కేశవులు, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటస్వామి, నాయకులు సురేష్, కట్టా హరి, ప్రతాప్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, నాగరాజు, ఆదినారాయణ, రమణమూర్తి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, బుర్రా రమణ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

మెగాడీఎస్సీ సంతకంతో చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు

మదనపల్లె టౌన్, జూన్ 14: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపడుతూనే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మెగాడీఎస్సీపై సంతకం చేసి వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు చేపట్టారని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్ తేజ పేర్కొన్నారు.

శుక్రవారం స్థానిక బుగ్గకాలువ వద్ద గంగమ్మ ఆల యంలో 501 టెంకాయలు కొటి మొక్కు తీర్చుకున్నారు. ఈ సంద ర్భంగా అరుణ్‌తేజ మాట్లాడుతూ జగన్ జాబ్‌క్యాలెండర్ల పేరుతో నిరు ద్యోగులను మోసం చేశారని, కాని చంద్రబాబు అధికారంలోకి వస్తూనే 16,347 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. చంద్ర బాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ప్రణయ్‌రాయల్, జశ్వంత్, కరుణాకర్, విఘ్నేష్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత వరుణ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేత మార్పూరి వరుణ్

మదనపల్లె టౌన్, జూన్ 14: మదపపల్లె టీడీపీ యువనేత మార్పూరి వరుణ్ జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. శుక్రవారం కేక్ కట్ చేసి టీడీపీ నాయకులు, శ్రేయోబిలాషులకు పంచిపెట్టారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ వరుణ్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునబాబు, గంగారపు గౌతమ్‌రెడ్డి పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు



మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల్లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జూన్ 14: స్థానిక జడ్పీ హైస్కూ ల్‌లో శుక్రవారం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తూ ఇంటర్ ఎంపీసీ, సీఈసీ గ్రూపులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందిస్తానన్నారు. డీఈవో శివప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ హైస్కూల్‌లో ఏడు క్లాసు రూమ్‌లకు డోర్స్ లేవని ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది పదో తరగతిలో స్కూల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. ఎస్టీయూ రమణ తృతీయస్థానంలో మార్కులు సాధించిన విద్యార్థికి రూ.2500 నగదు అందజేశారు. కార్యక్రమంలో డీవైఈవో శ్రీరాంపురు షోత్తం, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్ఎం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు షంషీర్, నాదేళ్ల విద్యాసాగర్, రాధమ్మ, ఇసుకనూత నపల్లె జయరాంయాదవ్, మల్లికార్జుననాయుడు, వేణు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సన్మానం

మదనపల్లె అర్బన్, జూన్ 14: మదనపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికై, ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి స్కూల్ ప్రిన్సిపాల్ సేతు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు దుశ్శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విజయభారతి స్కూల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఇందుకు ఈ పాఠశాల్లో క్రమశిక్షణతోపాటు విలువతో కూడిన విద్యను అందించడమే అన్నారు. అక్కడికి మహిళలు తెచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, బాస్ అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్, డీవైఈవో శ్రీరాంపురుషోత్తం, మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, పులిమహాలక్ష్మీ, టీడీపీ నాయకులు షంషీర్, నాదేళ్ల విద్యాసాగర్, జేసీబీ వేణు, మధు, చిన్నా, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా సీనియర్ హాకి జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, జూన్ 14: అన్నమయ్య జిల్లా హాకి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల హాకి జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పీవీ ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మదనపల్లెలో ఆదివారం ఉదయం 10గంటలకు స్థానిక జినరాజదాస హాకి మైదానంలో నిర్వహించే ఎంపికకు జిల్లా వ్యాప్తంగా ఆసక్తి వున్న వారు పాల్గొనవచ్చన్నారు. 1995 జనవరి 1వ తేది తరువాత జన్మించిన వారు ఈ ఎంపికకు అర్హులన్నారు. ఎంపికకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికేట్ తీసుకురావాలని కోరారు. ఇక్కడ ఎంపికైన జట్టుకు నాలుగురోజుల శిక్షణ ఇచ్చి, రాష్ట్ర స్థాయిలో ఈనెల 27వ తేది నుంచి 30వ తేది వరకు ధర్మవరంలో నిర్వహించే హాకి పోటీలకు పంపుతామన్నారు. పూర్తి వివరాలకు 9880092188 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్టీసీలో నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లె అర్బన్, జూన్ 14: మదనపల్లె ఆర్టీసీలో వన్, టూ డిపోల పరిధిలో శనివారం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ వలన ఇబ్బందులు, సమస్యలపై ప్రయాణీకులు తమ దృష్టి తీసుకురావాలని కోరారు. ఈ ఫోన్‌నెంబరకు 9959225676కు సంప్రదించాలన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషపూజలు

మదనపల్లె అర్బన్, జూన్ 14: స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమవారిని మేల్కొలిపి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేషంగా పూల అలంకరణతో పూజలు చేశారు. మహిళలు ఆలయం చేరకుని చీర, జాకెట్లు, పసుపుకుంకుమలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాలనాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, కరుణాకర్, మార్పూరి మహేష్, మార్పూరి విక్కి, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

వాల్మీకిపురం, జూన్ 14: గత వైసీపీ ప్రభుత్వం అడ్డుగోలుగా తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ప్రస్తుత కొత్త ప్రభుత్వం ద్వారా సీఎం నారా చంద్రబాబునాయుడు రద్దు చేస్తూ సంతకం చేయడం పట్ల వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అందరూ కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బార్ సెక్రటరీ రమణ, మాజీ ఏజీపీ రవిప్రకాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

యువత రక్తదానం అలవరచుకోవాలి

మదనపల్లె టౌన్, జూన్ 14: సామాజిక సేవల్లో భాగంగా యువత రక్తదానం చేయాలని డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సత్సంగ్ ఫౌండేషన్, హార్సిలీహిల్స్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 57 మంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు రాజా, స్వాస్థ్య ఆస్పత్రి ఆర్ఎంవో ప్రియంవద, డాక్టర్ అశ్విన్‌కుమార్, పవన్ పాల్గొన్నారు. **గుర్రంకొండలో:**ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గుర్రంకొండలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో 53 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ములకలచెరువు, జూన్ 14: తాగునీటి సమస్య పరిష్కరించాలిని స్థానిక కదిరి రోడ్డుకు చెందిన మహిళలు శుక్రవారం ఎంపీడీవో పోలప్పకు వినతి పత్రం అందజేశారు. కదిరి రోడ్డులో ఆరు నెలలుగా కుళాయిల్లో నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు, కార్యక్రమంలో మహిళలు కళావతి, ఆదినారాయణమ్మ, రంగమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సవాళ్లను అధిగమించాలి

రైల్వేకోడూరు, జూన్ 14: విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొ నాలని ఉద్యాన కళాశాల అసోషియేట్ డీన్ కే. గోపాల్, మంగంటపేట బ్రైటీస్ ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి లు తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సమా వేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కళాశాల ఓఎస్‌డీ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, ఆచార్యులు స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూళ్లలో అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్

సుండుపల్లె, జూన్14: రాష్ట్రంలో ఉర్దూ స్కూల్ పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రభుత్వం స్పెషల్ డ్రైవర్ నిర్వహి స్తోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీ ఎంవో (ఉర్దూ) సమీయుల్లాఖాన్, షేక్ మహమ్మద్ హ పీం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను సంద ర్శించారు. ఉర్దూ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపా ధ్యాయుల కు సూచించారు. జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ తిమ్మసముద్రం, జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మడితాడును సందర్శించారు. తిమ్మసముద్రం, మడితాడు ప్రధానోపాధ్యాయులు ఆరిఫుల్లా, అబిదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెయ్యేటిలో ఇసుక నిల్వల తనిఖీ

పెనగలూరు, జూన్ 14 : మండలంలోని నారాయణనెల్లూరు వద్ద చెయ్యేటిలో ఇసుక వాస్తవ పరిస్థితిని శుక్రవారం మండలశాఖ అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నారాయణ నెల్లూరు ఇసుక క్వారీల్లో ఇసుక తరలింపును అధికారులు నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15 రోజులకొకసారి ఇసుక వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు పంపడంతో మండలశాఖ అధికారులు పరిశీలించారు.

మైనింగ్ అధికారులపై చర్యలకు ఆదేశాలు

ఓబులవారిపల్లె, జూన్ 14 : మంగంపేట ఏపీఎండీసీలో అనుభవం లేనివారితో మైనింగ్ చేస్తున్న వారిపై చర్యల కు డీడీఎంఎస్ అధికారులు ఆదేశించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. కార్మికులకు రక్షణ కల్పించాలని అర్హత కలిగిన అధికారులను నియమించాలని ఏప్రిల్ 30న మైనింగ్ సేఫ్టీ అధికారులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ నెల్లూరు రీజియన్ డీడీఎంఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి మే 20న విచారణ అధికారి కోటంనాయుడు మంగంపేట మైన్స్‌ను సందర్శించి ఫిర్యాదుదారు చంద్రశేఖర్‌తో కలిసి మైనింగ్ అధికారులను విచారించి, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులోని అంశాలు వాస్తవమే అని తేలడంతో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రీజియన్ మైన్స్ సేఫ్టి అధికారి రఘుపతి పెద్దరెడ్డి ఆదేశించారు.

వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తెస్తాం

సంబే పల్లె, జూన్ 14: ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఎ ప్లాంట్ వద్ద స్థానిక నాయకులతో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ సజల స్రవంతి పథకాన్ని వదిలేశారని తెలిపారు.

'హామీలు నెరవేరుస్తాం'

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 14: మైనారిటీలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని రైల్వేకోడూరు యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో మండల మైనారిటీ నాయకులు పటాన్ మౌలా, షేక్ మస్తాన్ టీడీ పీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ జుబేర్, సయ్యద్ మను ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపు కోసం కృషి చేసిన మైనారిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ నాయకులు మొహమ్మద్ బాషా, షేక్ అజీమ్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలసిన బొమ్మనచెరువు



సీఎం చంద్రబాబును అభినందిస్తున్న టీడీపీ నేత బొమ్మనచెరువు శ్రీరాములు

మదనపల్లె, జూన్ 14: మదనపల్లె టీడీపీ సీనియర్ నేత బొమ్మనచెరువు శ్రీరాములు నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీఎం నారా చంద్రబాబునాయుడును కలిశారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివా సానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ని కల్లో బాగా కష్టపడి పనిచేశారని, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ప్రతిఒక్కరికీ భవిష్యత్తు ఉంటుందని అధినేత, శ్రీరాములుకు భరోసా ఇచ్చారు. అలాగే బొమ్మనచెరువు శ్రీరాములు మంగళగిరిలో పులువురి మంత్రులను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇందులో హోం మంత్రి వంగలపుడి అనిత, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిలను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌ని కలిసిన మిట్స్ కరస్పాండెంట్



మంత్రి నారా లోకేశ్‌ని అభినందిస్తున్న నాదెళ్ళ విజయభాస్కర్‌చౌదరి

కురబలకోట, జూన్ 14: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ళ విజయభాస్కర్‌చౌదరి ఐటీశాఖామంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ గెలుపు మీరు ఎంతో కష్టపడ్డారని, పార్టీ కోసం మీరు ఎంతో కష్టపడి పని చేశారని మంత్రి ఆయనను అభినందించారు. కాగా నియోజకవర్గాలలో నెలకొన్న పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా తంబళ్లపల్లెలో ఓటమికి గల కారణాలను ఆయనను అడిగి తెలుసుకున్నారు. అలాగే నియోజకవర్గంలో పర్యటించాలని మంత్రిని కోరగా సానుకూలకంగా స్పందించి త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన శ్రీరామ్‌చినబాబు



మంత్రి కొల్లు రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వంలో నూతనంగా కొలువుదీరిన ఆరుగురు మంత్రులను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రుల చాంబ ర్లకు వెళ్లిన చినబాబు మంత్రులు అనగా నిసత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమా ర్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారా ణి, సవితలను వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పంతగాని నరసింహప్రసాద్, దొరస్వామినాయుడు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్

కలికిరి, జూన్ 14: పీలేరు నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను శాయశక్తులా అంకితభావంతో పని చేస్తానని పీలేరు తాజా ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి పదవి రాలేదని పలువురు నిరాశ వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రానికి కాకపోయినా నియోజకవర్గానికి తానే మంత్రినని చెప్పారు. కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన శుక్రవారం స్వగ్రామం నగరిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రజల మధ్య నిరంతరం అందుబాటులో ఉండేందుకు అనువుగా మంత్రి పదవి రాలేదేమోనని కిశోర్ కుమార్ రెడ్డి చెప్పారు. నియోజవర్గం నుంచి పలువురు ఆయనను కలుసుకుని అభినందనలు తెలిపారు. తాను మంత్రి కావాలన్న కోరితో కాకుండా అరాచక పాలనను అంతమొందించి ప్రజాస్వామిక ప్రభుత్వం కోసం ఐదేళ్ళు పోరాడి అనుకున్నది సాధించామని స్పష్టం చేశారు. ఈ విజయం ప్రజలందరికి చెందుతుందని చెప్పారు. ఇక్కడ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉందని, పార్టీ అధికారంలో ఉన్నందువల్ల సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. కాగా కలికిరి ఎంపీడీవో రామకృష్ణయ్యతో కలిసి పలువురు అధికారులు, సిబ్బంది కిశోర్‌కుమార్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలకు విద్యార్థుల కిట్లు చేరవేత

తంబళ్లపల్లె, జూన్ 14: తంబళ్లపల్లె మండలంలోని 65 ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల కిట్లను శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. శనివారం నుంచి ఆయా పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు స్టూడెంట్స్ కిట్స్ (పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు)ను పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తల్లితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో ఫలితాల్లో వెంకటరెడ్డి సిద్ధార్థ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీసిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె అర్బన్, జూన్ 14: ఈ నెల 11న విడుదలైన ఈఏపీసెట్‌లో స్థానిక ప్రశాంతనగర్‌లోని శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్వీట్స్ తినిపించి ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. సి. జోతి వర్మ1,727వ ర్యాంకు సాధించి కళాశాల్లో ప్రథమ స్థాయిలో నిలిచారు. అలాగే ఎస్.తౌసీఫ్ బీపీసీ విభాగంలో 4,525 ర్యాంకు, బి.మౌనిక 4,892 ర్యాంకు, ఆర్.లహరి 5,188 ర్యాంకు, ఎ.వినీల్‌కుమార్ 7,670 ర్యాంకు, బషీర్ అంజూమ్ 9,517 ర్యాంకులు సాధించారన్నారు. జి.భరిష్మా 11,114 ర్యాంకు, కె.తేజోమై 11,310 ర్యాంకు, జీ.బి. రమ్యశ్రీ 12,136 ర్యాంకు, కె.మహమ్మద్ రెహనా14,695 ర్యాంకు, ఉజామ్ అంజూమ్ 15,104 ర్యాంకు సాధించారని వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా పది వేలలోపు 6 ర్యాంకులు, 20 వేల లోపు 21 ర్యాంకులు, 30 వేల లోపు 30 ర్యాంకులు సాధించారన్నారు. ఈఏపీసెట్‌లో అర్హత సాదించిన మా విద్యార్థుల సంఖ్య 324 మంది అని తెలియజేశారు. అంతటి విజయాన్ని తెచ్చిపెట్టిన అధ్యాపకులకు, విద్యార్థి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

బురకాయలకోటలో జనసేన సంబరాలు



ములకలచెరువు, జూన్ 14: మండలంలోని బురకాయలకోటలో శుక్రవారం జనసేన పార్టీ అధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాన్‌లు బాధ్యతలు చేపట్టి, ఎన్డీఏ కూటమి విజయం సాధించడం పట్ల తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ అధ్వర్యంలో భారీ ద్విచక్రవాహన ర్యాలీ జరిగింది. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, రామకృష్ణమరాజు, విజయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, అనీల్‌కుమార్, జ్ఞానకుమార్, శ్రీనివాసులు, జేసీబీ శీనా, రెడ్డి సురేష్, సుదర్శన్, లక్ష్మణ్, బావాజీ, మణి, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.